## ఘనంగా రెవెన్యూ దినోత్సవం

చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త:



కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో గురువారం రెవెన్యూ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రెవెన్యూ దినోత్సవం కార్యక్రమంకు డిఆర్ఓ బి.పుల్లయ్య హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ శాఖ కీలకమైందని ప్రజా సమస్యల పరిష్కారం పూర్తిగా రెవెన్యూ శాఖతో ముడి పడి వుండటంతో ప్రతి ఒక్కరు ప్రజల సంతృప్తి పొందేలా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ వెంకటేశ్వర్లు, రెవెన్యూ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు పార్థసారధి, కార్యదర్శి హేమాద్రిరాజు, కోశాధికారి మధుసూధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

### 25, 26 తేదీల్లో

## సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో ఈనెల 25,26 తేదీల్లో పర్యటించనున్నారు. ఈమేరకు సిఎం పర్యటన ఖరారైనట్లు తెలిసింది. 25వతేది మధ్యాహ్నం కుప్పం చేరుకుంటారని 26వతేది సాయంత్రం కుప్పం పర్యటన ముగించుకుని బయలుదేరుతారని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం తన సొంత నియోజకవర్గం కుప్పంలో సిఎం చంద్రబాబు పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. సిఎం పర్యటన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై శ్రీవారు

### కన్నుల పండుగలా శ్రీవారి కల్యాణం





అప్పలాయగుంటలో ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహనంపై విహరిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు



వైభవంగా స్వామివారి కల్యాణం

వడమాలపేట, జూన్ 20 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి గురువారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం 4వరోజు స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా వాహన మండపం చేరుకున్న స్వామివారు సర్వంగా సుందరంగా అలంకృతుడై అలంకరించిన కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న శ్రీనివాసునికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు.

**న వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుని కల్యాణం**

శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి గురువారం కల్యాణోత్సవంను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి శ్రీనివాసుని కల్యాణాన్ని ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆర్జిత కల్యాణోత్సవం టికెట్లు తీసుకున్న దంపతులకు శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పోలేరమ్మ జాతర

### అమ్మవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

వెంకటగిరి, జూన్ 20, ప్రభాతవార్త



పట్టణం బంగారు పేటలో గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర వైభవంగా జరిగింది. పోలేరమ్మను వేలాది మంది భక్తులు బుధవారం రాత్రి నుంచి దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. వెంకటగిరి చుట్టు పక్కల నుండి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకొని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు బాగా చేశారని అభినందించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆయన తెలిపారు. పోలేరమ్మ అమ్మవారిని భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బంగారు పేటలో పోలేరమ్మ జాతర సందడి నెలకొంది. సిఐ సంగమేశ్వర రావు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు పార్టీ నాయకులు గంగాధర్, చంద్రమౌళి రెడ్డి, రాజేశ్వర రావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలకు కొత్త విసిలు!

### -ఆ ఇద్దరు తొలగింపుకు చర్యలు







తిరుపతి,జూన్ 20ప్రభాతవార్త:

తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలకు కొత్త ఉపకులపతులు నియామకం కానున్నారు. ఇందుకోసం ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ప్రస్తుతం ఉపకులపతులుగా కొనసాగుతున్న ఆచార్య భారతి, ఆచార్య శ్రీకాంత్‌రెడ్డిను తప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా తాజాగా గురువారం ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పదవీ విరమణ చేసిన తరువాత పలు హోదాల్లో, పలు రకాలుగా నియమితులైన అధికారులు, ఉద్యోగులు తక్షణం రాజీనామా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీతో తిరుపతిలో పద్మావతి మహిళ యూనివర్సిటీ విసిగా ఉన్న ఆచార్య భారతి ఆ పదవి నుండి తొలగడం తప్పనిసరిగా మారింది. ఆమె ఇప్పటికే బయోసైన్స్ సెరికల్చర్ విభాగం ఆచార్యురాలుగా పదవీవిరమణ చేశారు. ఆమెను గత వైసిపి ప్రభుత్వం 2023 జూన్‌లో ఉపకులపతిగా నియమించి వైసిపి ప్రజాప్రతినిధులు తమ పనులు చక్కబెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల వర్సిటీలో కొందరు అటెండర్లకు అడ్డగోలుగా పదోన్నతులు కల్పించి జూనియర్ అసిస్టెంట్‌లుగా నియమించడంలో వైసిపి ప్రజాప్రతినిధుల హస్తం ఉందని, విసి అడ్డగోలు పదోన్నతులు, పోస్టింగ్‌లు ఇవ్వడంపై వర్సిటీలో పెద్ద దుమారం రేగుతోంది. విశ్వవిద్యాలయంలో బోధన,బోధనేతర సిబ్బంది కూడా విసి తీరుపై కొంత అసహనం వ్యక్తం చేస్తుండటం విశేషం.అలాగే ఎస్వీయూ విసిగా ఆచార్య శ్రీకాంత్‌రెడ్డి వైసిపి నేతలతో అంటకాగి వారు చెప్పిందే వేదంగా పనిచేశారని ,కొన్ని నియమాకలు, అడ్డగోలుగా వ్యవహారాలు చేశారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ విషయాలన్నీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. కొద్దిరోజుల్లో ఈ ఇద్దరు ఉపకులపతులు తమతమ కుర్చీలు వదలకతప్పదు. పద్మావతి మహిళ వర్సిటీ ఉపకులపతి పదవికి ఆచార్య ఉమ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## రెవెన్యూ శాఖ తల్లి లాంటిది

### ప్రజల సమస్యలపై రెవెన్యూ సిబ్బంది పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 20, ప్రభాతవార్త





పూర్తి స్థాయిలో ప్రజల సమస్యలపై రెవెన్యూ సిబ్బంది పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫిరెన్స్ హాలులో జరిగిన రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ సిబ్బంది అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలకు రెవెన్యూ సిబ్బంది చేరువగా ఉండి ఎప్పటికప్పుడు సమస్యలకు పరిష్కారం చూపేలా పని చేయాలని అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా గ్రీవెన్స్, భూములు, తదితర సమస్యలకు సంబంధించిన సేవలపై బాధ్యతగా ఉండాలన్నారు. ప్రజలకు అందించే సేవలపై ఏ స్థాయిలో ఎలా చేయాలనే విషయాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రెవెన్యూ శాఖ విపత్తు, ప్రకృతి వైపరీత్యాల వంటి సమయాలలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. రెవెన్యూ దినోత్సవంను ప్రతి మండల, గ్రామ స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అసోసియేషన్ పాత్ర ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ విపత్తు, ప్రకృతి వైపరీత్యాల వంటి సమయాలలో సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ చాలా ముఖ్యమైనదని, దాని ప్రాముఖ్యతను పెంచాల్సిన అవసరం రెవెన్యూ సిబ్బంది పైన ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా కంప్యూటర్‌పైన నైపుణ్యం పొందడం వలన వారి పనితనం పెంచుకోవచ్చున్నారు. రెవెన్యూ సిబ్బంది ఇంకా బాగా పని చేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. డిఆర్ఓ మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవల రివ్యూల కోసం రెవెన్యూ దినోత్సవం కార్యక్రమాలను క్రమం తప్పకుండా జరుపుకోవాలని అన్నారు.

## గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం

### - జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సూళ్లూరుపేట, జూన్ 20 ప్రభాతవార్త



రాష్ట్రంలో గంజాయి అమ్మకాలపై ప్రభుత్వం వందరోజుల ప్రణాళిక పేరుతో కఠిన నిర్ణయాలు తీసుకుందని, ఇందులో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలో వందరోజుల్లో గంజాయి అమ్మకాలను అరికట్టి నేరస్థులపై ఉక్కుపాదం మోపుతామని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎన్నికల హడావుడి ఉండటంతో కొన్ని నిర్ణయాలను పోలీసుపరంగా తీసుకోవడంలో జాప్యం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాను జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి కౌంటింగ్ సందర్భంగాను, కౌంటింగ్ తర్వాత కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో అన్ని కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. ఇందుకు సహకరించిన పోలీసు కుటుంబానికి ఆయన అభినందనలు తెలిపారు. ఎన్నికల తర్వాత అప్రమత్తంగా వ్యవహరించి చిన్న చిన్న సంఘటనలు మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించగలిగామని ఎస్పీ తెలిపారు. ఇప్పటికీ అవసరమైన చోట్ల పోలీసు పికెటింగ్, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో పోలీసులు తమ విధులను నిర్వహించే విధంగా చర్యలు చేపడతామ న్నారు. గంజాయి స్మగ్లింగ్‌తో పాటు అక్రమ రేషన్ బియ్యం రవాణా కేంద్రంగా సూళ్లూరుపేట ఉందని, దీన్నిఅరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ఆయన పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందిని పేరుపేరునా అడిగి వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సీఐ మధుబాబులు పాల్గొన్నారు.

### జ్యేష్టాభిషేకంతో

## ముత్యపుకవచంలో మెరిసిన...



తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవిభూదేవిసమేత మలయప్ప గురువారం మధ్యాహ్నం ముత్యపుకవచంలో భక్తులను కటాక్షించారు. జ్యేష్టాభిషేక ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సంపంగిప్రాకారంలోని కల్యాణమండపంలో ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం, అభిదేయక అబిషేకం నిర్వహించారు. సాయంత్రం ముత్యపుకవచంలో ఉభయనాంచారులతో స్వామివారు మాఢవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ శ్రీహరి ,భక్తులు పాల్గొన్నారు.

### క్యూలైన్లలో, షెడ్లలో

## పారిశుధ్యం ఇంతేనా!?

### -నారాయణగిరి ఉద్యానవనంలో అపరిశుభ్రతపై ఈఓ కన్నెర్ర



తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:

స్వచ్చతిరుమలలో భాగంగా పుణ్యక్షేత్రం సప్తగిరులపై పారిశుధ్యం రోజురోజుకూ అధ్వాన్నంగా తయారైందనడానికి స్వయంగా టిటిడి నూతన ఈఓ జె.శ్యామలరావు తనిఖీల్లో గుర్తించడం ఆయనకు ఆగ్రహం తెప్పించింది. టిటిడి నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు నాలుగురోజులుగా వరుసగా కొండపై సుడిగాలిపర్యటన చేస్తూ అన్ని విభాగాలపై పట్టు పెంచుకుంటున్నారు. గురువారం ఉదయం తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీతో క్యూలైన్లు నారాయణగిరి ఉద్యానవనాల షెడ్ల ప్రాంతంలో చెత్తచెదారం పడి అపరిశుభ్రంగా వుండటంతో పారిశుధ్యం లోపించిందని గుర్తించారు. వెంటనే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీచేయాలని ఆదేశించారు.

## శివయ్యా! అంక్షలు కొన్నింటికేనా?!

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారుల తీరు మారటం లేదు.ఆలయంలో ఐదేళ్ళ పాటు పాలకుల పలుకుబడితో భక్తులకు ఎన్నో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా పాలకుల జోక్యంతో దళారుల వ్యవస్థ పెచ్చురిల్లింది.అవినీతి అవకతవకలకు వేదికగా మారింది. ఈ నెల 4న ఓట్ల లెక్కింపుల్లో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడింది. శ్రీకాళహస్తిలో తెలుగుదేశం అభ్యర్థి గెలిచారు.5న ఆలయంలో పరిచయ కార్యక్రమాల్లో గెలిచిన శాసనసభ్యుడు స్పష్టంగా భక్తుల మనోభావాలకు వ్యతిరేకంగా ఎవరు నడుచుకున్నా సహించేది లేదన్నారు.సంస్కరణలను అమలు చేయాలని సూచించారు.అయితే 15రోజుల పరిస్థితి పరిశీలిస్తే సంస్కరణలు కొన్నింటికే పరిమితం అన్నట్లు మారింది.**

శ్రీకాళహస్తి,జూన్ 20 ప్రభాతవార్త

పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి రోజూ కనీసం15వేల మందికి తగ్గకుండా భక్తులు వస్తున్నారు. శని,ఆది,సోమ,మంగళవారాల్లో పాతిక వేలు దాటుతున్నారు. ఇక్కడి ఆలయంలో ప్రధానంగా రాహు కేతుదోష నివారణ పూజలకు భక్తులు ప్రాధాన్యత ఇస్తున్నారు.అయితే ఈ పూజలు ఇటు పూజలు నిర్వహించే అర్చకులు,ఇక్కడ పని చేసే అటెండర్లకు, పర్యవేక్షించే ఆలయ ఉద్యోగికి అధికారులకు గతంలో పాలకులకు ఽకూడా వాటాలు ఉండటంతో బలవంతపూ వసూళ్ళు కొనసాగేవి. అయితే ఈ విధానానికి స్వస్తి చెప్పాలంటూ కొత్తగా గెలిచిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశించారు. తీరు మారకపోతే మార్చాల్సి వస్తుందని హెచ్చరించారు.పవిత్రమైన ఆలయంలో నితి నిజాయితి పాలన సాగాలని స్పష్టం చేసారు.దళారుల వ్యవస్థకు స్వస్తి చెప్పాలని కూడా సూచించారు.



అలాగే ఎక్కడెక్కడ శివరాత్రి పనులు నిర్వహించారో వివరాలు ఇవ్వాలని కూడా కోరారు.అయితే రాటుతేలిన అధికారులు,వారిని మించిన సిబ్బంది తట్టలతోనే పబ్బం గడుపుకుంటున్న చిరుద్యోగులు తీరు మారటం లేదని తేటతెల్లమౌతుంది.

### తీరు మారని అధికారులు

**ఒక్క రూ.500ల పూజా మండపం తప్ప . . .**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతీయవద్దని, బలవంతపు వసూళ్లు వద్దని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సూచించారు. ఆయన ఆదేశాలు అధికారుల చర్యలు రెండు మూడు రోజులు కూడా అమలు జరగలేదు. ప్రస్తుతం ఒక్క రూ.500ల రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహించే మండపంలో తప్ప మరెక్కడా సంస్కరణలు అమలు జరగటం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.ఇక్కడ రూ.750,1500,2500,5000ల పూజలు కూడా జరుగుతున్నాయి. అలాగే ఆలయంలోని స్వామి అమ్మవార్ల గర్భాలయం వద్ద తట్టల సంస్కృతికి స్వస్తి చెప్పాలని కూడా ఆదేశించారు.కానీ ఎక్కడా అమలు జరుగుతున్నట్లు కనబడటం లేదు. భక్తుల నుంచి వసూళ్ళు చేసుకుంటూనే ఉన్నారు.అయితే దళారుల మీద కొంత కట్టడి ఉంది.కంచుగడప వద్ద టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులను మాత్రమే అనుమతిస్తున్నారు.వారితో పాటు వచ్చిన దళారులను కంచుగడపను దాటనివ్వటం లేదు.అయితే ఆలయంలో గర్భాలయం వద్ద తట్టల సంస్కృతి మారటం లేదు.నాయకుడేమో సంస్కరణల పరుగులు.అధికారులేమో నత్తనడకన అమలు మరి ఎలా సమన్వయం కుదురుతుందో వేచి చూడాలి.

### శ్రీవారిమెట్టు మార్గంలో

## టోకెన్ స్కాన్ తప్పనిసరి

### స్కాన్ లేకుండా తిరుమలకు వెళ్ళినా దర్శనానికి నో

### భక్తులు దోపిడికి గురికాకుండా నూతన ఈఓ చర్యలు

### 1200 మెట్టు వద్ద ప్రయోగాత్మక పరిశీలన

చంద్రగిరి, జూన్ 20 ప్రభాతవార్త:



తిరుమల శ్రీవారి దర్శనం కోసం తీసుకున్న టోకెన్ స్కానింగ్ చేసుకోవడం తప్పనిసరి చేస్తూ టిటిడి నూతన ఈఓ శ్యామలరావు చర్యలు చేపట్టారు. తిరుమల శ్రీవారి దర్శనా ర్థం శ్రీవారిమెట్టు వద్ద టోకెన్లు జారీ చేసే విధానంతో దళారీ వ్యవస్థ వెలుగుచూసింది. తిరుపతి నుండి ఆటోల ద్వారా యాత్రికులను తీసుకువచ్చి టోకెన్లు తీసుకుని తిరిగి తిరుపతిలో వదలిపెట్టడం ద్వారా భక్తుల నుండి భారీగా దోచుకున్నట్లు ఆరోపణలు వున్నాయి. ఈ నేపథ్యంలో ఈ టోకెన్ల వ్యవహారంలో తిరుపతి ఆటో డ్రైవర్లకు, ఇక్కడి స్థానికుల ఘర్షణలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో నూతనంగా భాధ్యతలు చేపట్టిన టిటిడి ఈఓ శ్యామలరావు భక్తులు దోపిడికి గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి దర్శనార్ధం శ్రీవారిమెట్టు వద్ద టోకెన్ తీసుకున్న భక్తులు ఇకపై తప్పనిసరి కాలినడకన తిరుమలకు వెళ్ళాల్సిన పరిస్థితిని తీసుకువచ్చారు. దర్శనానికి వెళ్ళాలంటే భక్తులు 1200 మెట్టు వద్ద దర్శన టోకెన్‌ను స్కానింగ్ చేసుకుని వెళ్ళడం తప్పనిసరి చేశారు. ఇందులో భాగంగా గురువారం నుండి భక్తుల దర్శన టోకెన్లను ప్రయోగాత్మకంగా స్కానింగ్ చేయడం ప్రారంభించారు.

## వృద్ధులకు టిడిపి నేతలు అన్నదానం



పుత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ జన్మదినం సందర్భంగా టిడిపి పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో గురువారం కార్వేటినగరం రోడ్డులోని వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. అలాగే కార్యక్రమం లో 16వ వార్డు టిడిపి నాయకులు పి.భాస్కర్, లక్ష్మణాచ్చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిఈవో చేతుల మీదుగా భాష్యం విద్యార్థులకు అభినందన

తిరుపతి విద్య, జూన్ 20, ప్రభాతవార్త



స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న న్యూ బాలాజీ కాలనీలో గల భాష్యం బృహస్పతి క్యాంపస్ నందు మార్చి 2024లో జరిగిన ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు 590కి పైగా సాధించిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి వి. శేఖర్ అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు జి. దీపిక శ్రీ 597, ప్రేమ్ కుమార్ 593, అబ్దుల్ ఫైజాన్ 593, వై. హరజిత్ రెడ్డి 592, ఎల్. వేధిక కృష్ణ 590, ఎస్. తనీష్ 590 తదితర విద్యార్థులను అభినందించారు. డిఈవో మాట్లాడుతూ బాగా చదువుకొని ఉన్నత విద్య గడించి దేశానికి, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ నేతాజీ, శ్రీనివాసులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ రేణుక మాత అమ్మవారి బ్రహ్మోత్సవాలు

కేవీబీ పురం, జూన్ 20 ప్రభాతవార్త:



మండలంలోని తిమ్మసముద్రం పంచాయతీ గ్రామం తిమ్మసముద్రం అరుంధతివాడలో స్థానికంగా వెలసిన శ్రీశ్రీ రేణుకా మాత అమ్మవారి బ్రహ్మోత్సవాలు గురువారం చాటింపు కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి కార్యక్రమాలు నిర్వాహకులు రంగయ్య ఆధ్వర్యంలో రేణుకా మాత దేవి అమ్మవారి విగ్రహాన్ని తేరు మీద పూలమాలలతో వైభవంగా నిర్మించి ఏర్పాటు చేశారు. అమ్మవారిని ట్రాక్టర్‌పై పురవీధుల్లో ఊరేగించారు కార్య నిర్వాహకులు రంగయ్య మాట్లాడుతూ ఆదివారం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం ఉంటుందని రోజు ఆలయంలో అమ్మవారికి నిత్య పూజలు జరుగుతాయని పరిసర గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకుని కృపాకటాక్షాలు పొందాలని ఆయన కోరారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు..ఎస్పీ

తొట్టంబేడు, జూన్ 20 ప్రభాతవార్త



పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. గురువారం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు మద్యం బాబులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు ఆదేశాలు జారీచేయడంతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పట్టణంలోని పలు ప్రాంతా లను పరిశీలించారు. డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డితో కలసి పలు ప్రదేశాలను గుర్తించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసు నెంబర్లతో కూడిన హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే లాడ్జీలను కూడా ఎప్పటికప్పుడు పోలీసులు తనిఖీచేయాలని ముఖ్యంగా లాడ్జీల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తమకు పిర్యాదు వస్తున్నాయని తెలిపారు. పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి పడేసి ఉన్న బాటిళ్ళను పురపాలక సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆయనతో పాటు అర్బన్ సిఐ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## పానగల్ అమ్మవారిని దర్శించుకున్న చెంచురత్నం



-ఘనంగా అమ్మవారి నిమజ్జనం

తొట్టంబేడు, జూన్ 20 ప్రభాతవార్త

పానగల్ జాతర సందర్భంగా పట్టణంలోని పానగల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు బుధవారం రాత్రితో ముగిసాయి. ఉత్సవమూర్తికి ఉదయం నుంచి అభిషేకాలు నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏపి పంచాయతీరాజ్ కార్యదర్శి మరియు శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షుడు సి.చెంచురత్నంయాదవ్ అమ్మవారిని దర్శించుకుని నిమజ్జనం వేడుకల్లో పాల్గొని మొక్కులుతీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు. జాతర నిర్వాహక కమిటీ సభ్యుడు పుణ్యండిల్లీకుమార్ చెంచురత్నంయాదవ్‌కు దుశ్శాలువతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. రాత్రి అమ్మవారిని విద్యుత్‌కాంతుల మధ్య నిమజ్జనానికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

## సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన

తొట్టంబేడు, జూన్ 20 ప్రభాతవార్త

సికెల్‌సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన అవసరమని కాసరం పిహెచ్‌సి వైద్యాదికారి డాక్టర్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. సికెల్‌సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా కాసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పిల్లమేడు గ్రామంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే 40 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్బంగా వైద్యాధికారి మాట్లాడుతూ దేశంలో సుమారు 10లక్షల మంది సికెల్‌సెల్‌అనీమియా వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఈవ్యాధిని ప్రాథమిక దశలోనే వ్యాధి తీవ్రతను బట్ట వైద్యం అందించగలిగితే వ్యాధిగ్రస్తులను వ్యాధిబారి నుంచి కాపాడుకోవచ్చున్నారు. కార్యక్రమంలో వైద్యాదికారి మాధవులు, ఎంపిహెచ్ ఈవో భాష, పిహెచ్ఎన్ గౌరి, హెల్త్ సూపర్‌వైజర్ అమ్మనమ్మ,ఆరోగ్యకార్యకర్తసురేఖ, ఆశా కార్యకర్తలు పద్మ, రాజేశ్వరి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షునికి సత్కారం

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త



రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారం చేపట్టిన తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్ర బాబునాయుడు సిఎం అయిన సందర్భంగా తిరుమల వెంకటేశ్వరస్వామిని కాలినడకతో వెళ్ళి తలనీలాలు సమర్పించి దర్శించుకుని విచ్చేసిన రాష్ట్ర యస్‌టి సెల్ అధ్యక్షులు మరియు మాజీ యస్‌టి కార్పొరేషన్ ఛైర్మన్ యం.దారునాయక్‌కు స్వాగతం పలికి సుబ్బయ్య ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా తిరుపతి పార్లమెంటు యస్‌టి సెల్ అధ్యక్షులు మరియు రాష్ట్ర యస్‌టి సెల్ అధ్యక్షులు మరియు రాష్ట్ర యస్‌టి సెల్ అధికార ప్రతినిధి ఎ.కళావతి మరియు రాష్ట్ర యస్‌టి సెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్, యానాదుల మహాకూటమి రాష్ట్ర ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జాతీయ సెమినార్

తిరుపతి విద్య, జూన్ 20, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం ఆక్సిలరేటర్ ఇంక్యుబేషన్ అపర్చునిటీస్ ఎర్లీ స్టేజ్ ఎంటర్ప్రెన్యూర్స్ అను అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ చాన్సలర్ ప్రొ. డి. భారతి ఆధ్వర్యంలో వహించారు. ఈ కార్యక్రమంకు విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆహ్వానించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యను ముగించిన తరువాత ప్రధానమంత్రి పిలుపు మేరకు జాబ్ ప్రొవైడర్స్‌గా తయారు కావాలని జాబ్ సీకర్స్‌గా ఉండకూడదన్నారు. అలాగే ప్రధానమంత్రి నిధులతో చాలా విశ్వవిద్యాలయంలో కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్స్ ఏర్పాటు చేయబడిందన్నారు. విద్యార్థులు ఇంక్యుబేషన్ సెంటర్ వసతులను ఉపయోగించుకొని ఇంక్యుబేటీస్‌గా తయారు అవ్వాలని వారి ఆలోచనలను ఇంక్యుబేషన్ సెంటర్‌లో విశదీకరించి చెప్పడం ద్వారా వారికి తగిన డబ్బు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి వేలూరు యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ నుండి ప్రొఫెసర్ ఎం. రాజశేఖర్ బాబు, డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ప్రొఫెసర్ పి. వెంకట కృష్ణ , డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీరు ఇరువురు రిసోర్స్ పర్సన్స్‌గా ఉండి ఇంక్యుబేషన్ ఆపర్చునిటీస్‌కు సంబంధించిన మెలకువలను తెలిపారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎం. ఉషారాణి, డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ హెడ్ కె. చందన శ్రీ, ఐఐసి సభ్యులు వ్యవహరించి కార్యక్రమాన్ని సజావుగా నడిపించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ స్టాఫ్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ పేరు పెట్టడం హర్షణీయం - అంబేద్కర్ స్టార్ కృష్ణ

రేణిగుంట, జూన్ 20 ప్రభాతవార్త:



జగనన్న విదేశీ విద్యా పథకంను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంబేద్కర్ విదేశీ విద్యా పథకంగా మార్చడం అభినందనీయమని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను అభినందించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు విదేశాల్లో మారుమోగేలా చేసినఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు గత ప్రభుత్వం రద్దు చేసిన 27 పథకాలను తిరిగి ప్రవేశపెట్టి దళితుల అభివృద్ధికి సహకరించాలని చంద్రబాబునాయుడుకు అంబేద్కర్ స్టార్‌కృష్ణ విజ్ఞప్తి చేశారు.

## చీరాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి

రేణిగుంట, జూన్ 20 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం గుత్తివారిపల్లెలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ చీరాలమ్మ తల్లిని ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం గురువారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గుత్తివారిపల్లెలో శ్రీ చీరాలమ్మ (గ్రామదేవత శ్రీ గంగమ్మతల్లి)జాతర వైభవంగాజరు గుతుంది. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అమ్మవా రిని దర్శించుకోవడానికి వచ్చారు. ఆయనకు జాతర నిర్వాహకులు ప్రత్యేక ఆహ్వానం పలికి ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డా. బాబు, అడ్వకేట్ తిరుమలరెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ గణేష్‌రెడ్డి, రమేష్, లోకేష్, హరి తదితరులు అమ్మతల్లిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

## బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి..!

ఎంఈఓ మార్కొండేయ నాయుడు

రామచంద్రాపురం, జూన్ 20 ప్రభాతవార్త:

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత అని ఎంఈఓ మార్కొండేయ నాయుడు అన్నారు. గురువారం రామచంద్రాపురం ఎస్టీ కాలనీలో "నేను బడికి పోతా" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఎస్టీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 6-14 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ బడిలోనే వుండాలని తల్లిదండ్రులకు సూచించారు. మధ్యలో బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నదే నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి, సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

## అనుప్పల్లి సచివాలయంలో ప్రోటోకాల్ ఫోటోలు

రామచంద్రాపురం, జూన్ 20 ప్రభాతవార్త:



అనుప్పల్లి గ్రామ సచివాలయంలో గురువారం తెలుగుయువత నాయకులు ప్రోటోకాల్ ఫోటోలను ఏర్పాటు చేశారు. సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్, స్థానిక శాసన సభ్యుడు పులివర్తి నాని ఫోటోలను పంచాయతీ కార్యదర్శి భువన ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు బండి విజయ్‌కుమార్ రెడ్డి, బొడ్డు సోము రాయల్, బొడ్డు మధు రాయల్, బోడిరెడ్డి పురుషోత్తం రెడ్డి,. ఆకా దేవరాజులు, తాతిరెడ్డి వెంకటేష్ రెడ్డి, పంతల వెంకటేష్ నాయుడు, గుర్రం దేవరాజుల రెడ్డి, ఆరిపల్లి సిద్దయ్య యాదవ్, చిట్టిబాబు రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## రాస్ చిరుధాన్యాల ఉత్పత్తిమేళ

తిరుపతి,జూన్ 20ప్రభాతవార్త:



రాస్ కృషివిజ్ఞానకేంద్రం,నాబార్డు సంయుక్తంగా తిరుపతిలో చిరుధాన్యాల ఉత్పత్తుల మేళ. సాగుపై అవగాహన శిబిరం మొదలైంది. తిరుపతిలోని రాస్ ప్రధాన కార్యాలయంలో రాస్ కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు,రాస్ సిబ్బంది, చిరుధాన్యాల పంటల రైతులు పాల్గొన్నారు. తిరుపతి పరిసరాల్లోని రైతులుపాల్గొని వర్షాధారిత వ్యవసాయ అనుబంధ రంగాల చిరుధాన్యాలు సాగు సులభతరమని వివరించారు.

## రెవెన్యూ శాఖలో 35 రకాల సేవలు

తహసీల్దార్ రామాంజనేయులు



సత్యవేడు, జూన్ 20 ప్రభాతవార్త:

రెవెన్యూశాఖ పరంగా ప్రజలకు 35 రకాల సేవలు అందిస్తున్నట్లు తిరుపతి జిల్లా సత్యవేడు తహసీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆదాయం, కుటుంబం, ఓబీసీ పొజిషన్ సర్టిఫికెట్, ఈ పాస్ బుక్, వన్ బీ, వ్యవసాయ సర్టిఫికెట్, పట్టా సబ్ డివిజన్, వ్యవసాయ బోర్లకు అనుమతి, టపాకాయల లైసెన్స్ వంటిసేవలు ఇందులో ప్రధానంగా ఉందన్నారు. తదనంతరం రెవెన్యూడే పురస్కరించుకుని రెవెన్యూశాఖలో విశేష సేవలు అందించి పదవి విరమణ చేసిన విశ్రాంత ఆర్ఐ గోకుల్, వీఆర్వో సుబ్రహ్మణ్యంలను తహసీల్దార్ రామాంజనేయులు, సిబ్బంది పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ డీటీ రవిచంద్రబాబు, జూనియర్ అసిస్టెంట్‌లు కళావతి, తేజ, కంప్యూటర్ ఆపరేటర్ సుధ, జగదీష్, వీఆర్‌వోలు ఇళయరాజా, భార్గవ్, విక్రాంత్, రాఘవేంద్ర, రమేష్, మోహన్‌రాజ్, శేఖర్, మండల సర్వేయర్ వెంకటేష్, సచివాలయ సర్వేయర్లు గిరి, షణ్ముగం, ఈశ్వర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుట్టినరోజు వేడుకలు

నగరి, జూన్ 20, ప్రభాతవార్త



నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా నియోజకవర్గం నుండి వేలాది మంది తరలి రాగా ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, టిడిపి, జనసేన, బిజెపి కుటుంబ సభ్యులు మధ్య కోలాహలంగా జరిగింది. అనంతరం నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్‌కు స్పందించి 110 మంది బ్లడ్ బ్యాంక్‌కు రక్తదానం చేశారు. అభిమానులు ఏర్పాటు చేసిన 47 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కట్ చేసి పంచి పెట్టారు. భారీ గజమాలతో ఎమ్మెల్యేను తెలుగు యువత సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నింద్రలో**

నింద్ర,జూన్ 20 ప్రభాతవార్త :

నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదిన వేడుకలు గురువారం మండల కేంద్రంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు,అబిమానులు మధ్య ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యస్‌సి సెల్ ఉపాధ్యక్షులు ధశరధ వాసు, మండల టిడిపి అధ్యక్షులు పేరం వెంకటేశులు నాయుడు,నాయకులు రఘుయాదవ్,గంగధరంనాయుడు, చిట్టిబాబునాయుడు, లోకనాథంనాయుడు, తంగవేలురెడ్డి,భాస్కర్,పరదేశి,కోటీశ్వరరావు,జగన్,బాబుయాదవ్,గాలిరమేష్‌నాయుడు,మనోహర్ నాయుడు, మోహన్‌రెడ్డి,రవినాయుడు,లోకేష్,ఏబు,పరదేశి,తదితరులు పాల్గొన్నారు.

**వడమాలపేటలో**

**వడమాలపేట, జూన్ 20 ప్రభాతవార్త:** నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినం సందర్భంగా వడమాలపేట మండలంలోని నాయకులు గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాదిరేడులో పూల గణపతి, దాముయాదవ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కల్లూరులో మోహన్ కార్యకర్తలతో కలసి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీచేశారు. శ్రీ బొమ్మరాజపురంలో భానుప్రకాష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

**విజయపురంలో**

విజయపురం, జూన్ 20 ప్రభాతవార్త:

మండలంలోని మహారాజపురం గ్రామంలో గురువారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినం పురస్కరించుకుని టీడీపీ నాయకులు, క్యాకర్తలు పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ చిత్తూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.బాలసుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ గాలి భానుప్రకాష్‌కు మా గ్రామ పంచాయతీ పార్టీ నాయకుల తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పురుషోత్తం, వెంకటేష్ యాదవ్, భాస్కర్‌జు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలందరు బడిలోనే ఉండాలి..ఎంఈవో

తొట్టంబేడు, జూన్ 20 ప్రభాతవార్త

బడిఈడు పిల్లలందరు బడికి వెళ్ళాలని శ్రీకాళహస్తి మండల విద్యాశాఖాధికారులు భువనేశ్వరి, బాలయ్యలు అన్నారు. శ్రీకాళహస్తి అర్బన్ పరిధిలోని భరద్వాజ గిరిజన కాలనీలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లలను బడిలో చేర్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఎంఈవోలు మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తి చేసిన పిల్లలందరు విధిగా ఆరో తరగతి చేరేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

# తిరుపతి డివిజన్

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

: పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు

నారాయణవనం, జూన్ 20 ప్రభాతవార్త :

ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలంటే అసాంఘిక కార్యకళాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఉన్నత అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మరాజులస్వామి ఆలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగిన తర్వాత బాటిళ్లను, ప్లాస్టిక్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ వేయడాన్ని పరిశీలించి తన సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ఎక్కడ పడితే అక్కడ బాటిళ్లను, ప్లాస్టిక్ కాగితాలు, డిస్పోస్‌లను వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ సిఐ ఎం భాస్కర్‌నాయక్, ఇంచార్జీ ఎఎస్ఐలు ఆశీర్వాదం, జయరాంనాయక్, సిబ్బంది భాస్కర్, రాజేష్, భాస్కర్‌రెడ్డి, వినోద్, శివప్రసాద్, మునికుమార్, శ్రీనాథ్, మహిళా కానిస్టేబుళ్లు అందరు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్బడితే చర్యలు తప్పవు

డీఎస్పీ శ్రీనివాసరావు

పుత్తూరు రూరల్, జూన్ 20 ప్రభాతవార్త :



అసాంఘిక కార్యకళాపాలకు పాల్బడే వారిపై కఠిన చర్యలు తప్పవని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నత అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని కల్యాణపురం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగిన తర్వాత బాటిళ్లను, ప్లాస్టిక్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ వేయడాన్ని పరిశీలించారు. అనంతరం తన సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ ఓబయ్య, ఎస్ఐ వెంకట మోహన్, పోలీసుశాఖ సిబ్బంది అందరు పాల్గొన్నారు.

## మల్లవరం పంచాయతిలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టండి

-టిడిపి నాయకులు మనోహర్ చౌదరి డిమాండ్

తిరుపతిరూరల్, జూన్ 20 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం సి.మల్లవరం గ్రామ పంచాయతి కార్యాలయంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని ఆ పంచాయతీ టిడిపి ఇన్‌చార్జి మనోహర్ చౌదరి డిమాండ్ చేసారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన అవినీతిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరపాలన్నారు. గురువారం పంచాయతి కార్యాలయ ఆవరణలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా సి.మల్లవరం గ్రామ పంచాయతీలో నీటి కుళాయి మంజూరు, నూతన భవనాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసేందుకు అధికారులు పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపించారు. ప్రజల దగ్గర వసూలు చేసిన సొమ్మును ఖజానలో జమ చేయలేదని, జమ చేసినట్లు బిల్లులు లేవని తెలిపారు. అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రవిచంద్రనాయుడు, నవీన్‌రాజు, షావలి, మురళి, అశోక్, గిరిధర్‌రెడ్డి, ప్రభు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహంలో మలేరియా నివారణ చర్యలు

ఏర్పేడు, జూన్20, ప్రభాతవార్త;

మండల కేంద్రమైన ఏర్పేడు బాలుర వసతి గృహంలో మలేరియా దోమల నివారణ చర్యలు చేపట్టారు. వసతి గృహ సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం ఆరోగ్య శాఖ సిబ్బందిని సంప్రదించి నివారణ చర్యలను చేపట్టారు. తొలకరి వర్షాలు ప్రారంభం కావడం, నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడం, విద్యార్థులు వసతి గృహాలకు చేరుకోవడంతో దోమల బెడదను నియంత్రించడం కోసం. శ్రీకాళహస్తి మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.శివకుమార్ ఆధ్వర్యంలో మాలాథియాన్ 25శాతంను మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యార్థులు నివసించే గదులు వసతి గృహ పరిసరాల్లో దోమలు ప్రబల కుండా పిచకారి చేశారు. వసతి గృహ సంక్షేమ అధికారి పల్లా వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగింది. ఈకార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది మరియు ఆశా వర్కర్ లత పాల్గొన్నారు.

## ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు



ఏర్పేడు, జూన్20, ప్రభాతవార్త;

మండల కేంద్రమైన ఏర్పేడు తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజు అధ్యక్షతన రెవెన్యూ అధికారులు గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్బంగా తహసిల్దార్ ఉదయ్ భాస్కర్ రాజు ఇక్కడ ఒకప్పుడు ఎమ్మార్వోగా సేవలు అంధించి డిప్యూటీ కలెక్టర్‌గా పదవీ విరమణ పొందిన ధరణీపతిని దుశ్శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అదే విధంగా స్థానిక మండల వీఆర్వోలు, విఆర్ఏలను మండల సిబ్బంది మొత్తానికి ఆయన పేరు పేరున పిలిచి దుశ్శాలువలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### పిల్లలను అంగన్వాడిలో చేర్పించాలని ర్యాలీ

ఏర్పేడు, జూన్20, ప్రభాతవార్త;

పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భారతి సిబ్బందితో గురు వారం కొత్తవీరాపురం, కోబాక, మోదుగులపాళెం, కుమ్మరమిట్ట యానాది కాలనీలలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చదువులతో పాటు సమతుల పౌష్టికాహారాన్ని అంధించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం, అంగన్వాడీ కార్యకర్తలు, వైష్ణవి, భారతి, శారదా, నాగభూషణమ్మ, మరియు అంగన్వాడీ హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రికి ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త



రాష్ట్ర ఎక్సైజ్ గనులు జియాలజీశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కొల్లురవీంద్ర ఆయన జన్మదినోత్సవం సందర్భంగా తొలిసారి తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసినందుకు ఆయన్ను విమానాశ్రయంలో ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రికి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి మంత్రిని దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.

### రోజు వేతనం రూ.300 చెల్లించే విధంగా చర్యలు చేపట్టండి

ఏర్పేడు, జూన్20 ప్రభాతవార్త;

ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం రూ.300చెల్లించే విదంగా వారికి కొలతలపై అవగాహన కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సివి శ్రీనివాస ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అముదూరు పంచాయతీలో జరుగుతున్న పెర్క్యులేషన్ పాండ్ పూడిక తీత పనులను గురువారం ఆయన అకస్మికతనిఖీ నిర్వహించారు. ఆయన కూలీలతో మాట్లాడుతూ 10మంది కూలీలు ఒక గ్రూపుగా ఏర్పడి ముగ్గురు గడ్డపార పని, ముగ్గురు పారతో బుట్టిగెన్నెల్లో మట్టిని నింపే పని, నలుగురు బుట్టిగెన్నెల్లో మట్టిని తరలించే పని చేస్తే వారికి కొలతల ప్రకారం రోజు వేతనం రూ.300రూపాయలు పొందుతూ వారానికి అంటే ఆరు రోజులకు 1800రూపాయలు గిట్టుబాటు అవుతుందన్నారు.


Form No.3

(See Regulation -15 (1)(a)] /16(3)

**SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, R/W SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBT RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES, 1993 BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD -500001**

**O.A. No. 516 / 2023**

Between:

**Union Bank of India,** Tiruchanoor branch, D.No.430-3, Prashanthi Nagar, Tiruchanoor, Tirupathi District - 517503 Rep by its Branch Manager **...Applicant**

And

1. **M/s. Sri Sai Srinivasa Agencies,** Rep by its Prop. Daddala Surendra Chowdary D.No. 7/108/4, Padmavathipuram, Tiruchanoor Road, Tirupathi District
2. **Daddala Surendra Chowdary,** S/o Late D. Venkataramana Naidu, Aged about 58 years, Occ: Business R/o D.No. 7/108/4, Padmavathipuram, Tiruchanoor Road, Tirupathi District (Or) Ravillavari Palli Village, Peddamallela Post, Rompicherla Mandal, Tirupati District
3. **Mr. V. Surya Kumar,** S/o Aged about 58 Years, Occ: Business R/o D.No.7/108/4, Padmavathipuram, Tiruchanoor Road, Tirupathi District

**...Defendants**

Whereas **O.A. No. 516 of 2023** was listed before Hon'ble Presiding Officer on **30-07-2024.**

Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for Recovery of debts of **Rs.41,52,137.14 ps** (application along with copies of documents etc., annexed) In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:

(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.

(ii) To disclose particulars of properties or asset otherthen properties and assets specified by the applicant under serial number 3A of the original application.

(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.

(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.

(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before Registrar on 30-07-2024 at 10.30 A.M. failing which the application shall be heard decided in your absence.

Given under my hand and seal of the Tribunal on this date of **19th June 2024.**

**Signature of the Authorised Officer to issue Summons**

# నీట్ పరీక్షా ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

**- చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన**




చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త: నీట్ యుజిసి నెట్ పరీక్షా ప్రశ్నాపత్రం లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాష్ట్ర ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి డిమాండ్ చేశారు. చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట గురువారం నీట్ యుజిసి నెట్ పరీక్షా పత్రం లీకేజీ నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి రాష్ట్ర ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాల్లో దేశ వ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, అందులో ఆరు మంది విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు చెందిన విద్యార్థులు వుండటంతో దీని వెనుక బీహార్‌కు చెందిన ఒక ముఠా వుందని ఆరోపించారు. ఈ ముఠా సభ్యులు నీట్ ప్రవేశపరీక్షలో 720 మార్కులు వచ్చిన ఒకొక్క విద్యార్థి నుండి 30 లక్షల రూపాయలు వసూలు చేసి దొరికినా వారిని ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని ఆరోపించారు. సత్వరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్పున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది ప్రతిభ కల్గిన విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని ఆరోపించారు. ఈ విద్యా సంవత్సరం ఎన్టీఏ విడుదల చేసిన పరీక్షా ఫలితాలు, పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. యుజిసి నెట్ పేపర్ లీక్ అయ్యిందని కేంద్ర విద్యాశాఖ అధికారులు రద్దు చేశారని, నీట్ పేపర్ ఎందుకు రద్దు చేయడం లేదో 24 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సత్వరం రాజీనామా చేయాలని లేని పక్షంలో వారి కార్యాలయాలను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్, జిల్లా నాయకులు షేక్ బాబు, ఆదిల్, వరుణ్, లోకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కోలా జన్మదిన వేడుకల్లో సామాజిక కార్యక్రమాలు





శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్, ప్రస్తుతం రాష్ట్ర బిజెపి కార్యదర్శి యువ నాయకుడు కోలా ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా అనుచరులు, బిజెపి కార్యకర్తలు, అభిమానులు నిర్వహించారు. గురువారం ముత్యాలమ్మగుడివీధి సంతమైదానంలో ఓ ప్రైవేటు పాఠశాల అవరణలో సంబరాలు ఏర్పాటు చేసారు. కాగా పట్టణంలోని వాడ వాడల్లో కూడళ్ళలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు వెలిసినాయి. రాజకీయ కార్యకర్త స్థాయి నుంచి ఎదిగి నేడు కేంద్రంలోని బిజెపి ప్రముఖులు జెపి నడ్డా, అమిత్‌షాతో సన్నిహితంగా మెలిగే కోలా ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా నియోజకవర్గంలోని గ్రామాల్లో అన్నదానాలను ఏర్పాటు చేసారు.

**అన్నదానాలు:**
కోలా ఆనంద్‌కుమార్ జన్మదిన సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదానాలు ఏర్పాటు చేసారు. ఉదయం నుంచి ప్రవేటు కళాశాల ఆవరణలో ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేసి ఆనంద్‌చే కేక్ కట్ చేయించారు. ఈ ఏడాది పలువురు అధికారులు, రాజకీయ ప్రముఖులు, అనుచరులు, పట్టణంలోని వివిధ వర్గాల ప్రజలతో పాటు వ్యాపారులు, చిరువ్యాపారులు ఆయనను పూల మాలలతో ముంచెత్తారు. దుశ్శాలువలతో సత్కరించారు. కొందరు మహిళలు అయితే ఎర్రనీళ్ళు దిష్టి తీసారు. ఇక్కడ వచ్చిన వాహనా లతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. కోలా ఆనంద్ జన్మదిన వేడుకలతో సంతమైదానం ప్రాంతానికి ప్రత్యేకత సంతరించుకుంది. పట్టణంలోని పెండ్లిమండపం, బేరివారి మండపం, పూల దుకాణాల వద్ద, పట్టణంలోని పలు చోట్ల అన్నదానాలు నిర్వహించారు.



ఏరియా ఆసుపత్రిలో సామాజిక కార్యక్రమాల్లో భాగంగా రోగులకు పాలు పండ్లు పంచిపెట్టారు.

## ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు



కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను గురువారం కుప్పంలో ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు మహిళ విభాగం నేతల అధ్వర్యంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ భారీ కేక్ కట్ చేసి మహిళా నేతలు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో నారా భువనమ్మ జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కోవిడ్ సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మెడిసిన్ కిట్లు, కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులో తెచ్చారన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మహిళా విభాగం కోఆర్డినేటర్ ప్రతాప్, రాష్ట్ర నేత శాంతారాం, నేతలు ఆర్ముగం, వాసు, తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, మహిళా నేతలు భాగ్యలక్ష్మి త్రిలోక్, సుగుణమ్మ, పద్మమ్మ, స్వాతి, తిరుమగళ్, తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురం :** స్థానిక తెదేపా కార్యాలయంలో సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనమ్మ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి మహిళా కార్యకర్తలు, నేతలకు పంచారు. కార్యక్రమాల్లో పలువురు నేతలు పాల్గొన్నారు.

**రామకుప్పం :** సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనమ్మ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్న క్యాంటీన్ వద్ద కేక్ కట్ చేసి పంచారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునసా్వమి, పట్ర నారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు ఆంజనేయరెడ్డి, నరసింహులు, సలాంసాబ్, విజయ్‌కుమార్‌రెడ్డి, జయశంకర్, సుబ్రి, అవినాష్, సతీష్, మంజునాథ్, ఆదిల్, అమర్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ యోగ సదస్సు




తిరుపతి విద్య, జూన్ 20 ప్రభాతవార్త : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రెండు రోజులు పాటు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా సదస్సు ప్రారంభోత్సవం గురువారం విశ్వవిద్యాలయంలోని ప్రముఖ రమారంజన్ మఖర్జీ ఆడిటోరియం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మధ్యప్రదేశ్, సాగర్ ప్రదేశంలోని డా.హరిసింగ్ గౌర్ యూనివర్శిటీ, యోగా విభాగం రిటైర్డ్ ప్రొ. గణేష్ శంకర్ విచ్చేసి ముఖ్య అతిథి భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగశాస్త్రం అనేటువంటిది భారతదేశ సంపత్తిలో ఒకటి యోగ అనేటువంటి ప్రక్రియ రోజు వారి ప్రక్రియగా జరగాలని, రోగం వచ్చినప్పుడు మాత్రమే యోగా కాకుండా, రోగం రాకుండా యోగ చేసేటువంటి విధానాన్ని ప్రజలందరూ అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా యోగాను దైనందిన జీవితంలో నిత్య ప్రక్రియగా చేసుకోవాలని సూచించారు. అనంతరం విశిష్ట అతిథిగా విచ్చేసినటువంటి ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ఎస్. భరత్ కుమార్ మాట్లాడుతూ యోగశాస్త్రం అనేటువంటిది భారతదేశానికి మన భారతీయ మహర్షుల అందించినటువంటి గొప్ప సంపత్తుగా ఆయన వర్ణించారు. ఈ కార్యక్రమం అంతటిని కూడా సాంఖ్య విభాగం యొక్క అధ్యక్షురాలు డాక్టర్ డి. జ్యోతి, యోగ విజ్ఞన విభాగం యొక్క అధ్యక్షులు డాక్టర్ ఆర్. లక్ష్మీనారాయణ యొక్క ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ టివి రాఘవాచార్యులు, ఇన్చార్జి రిజిస్టర్ ప్రొఫెసర్ ఆర్.జె. రమాశ్రీ, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, యోగ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగిందన్నారు.

## రేపు పౌర్ణమి గరుడసేవ

తిరుమల, జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి: జ్యేష్ఠమాసంలో వచ్చే గురుపౌర్ణమిన గరుడసేవ శనివారం తిరుమలలో జరగనుంది. ప్రతినెలా పౌర్ణమి ఘడియల్లో మలయప్పస్వామి విశేష ఆభరణాల అలంకృతుడై గరుడవాహనంపై ఊరేగుతాడు. ఆలయ నాలుగుమాఢవీధుల్లో భక్తులను కటాక్షిస్తాడు, రేపు సాయంత్రం 7గంటలకు ఈ వాహనసేవ జరుగుతుంది.

## ట్రాఫిక్ చిక్కుల్లో జయరామారావు వీధి

**క్రమశిక్షణ లేని ఆటో చోదకులు... పట్టించుకోని పోలీసులు**



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని జయరామారావు వీధి, సినిమావీధి, బజారువీధుల్లో నిత్యం ట్రాఫిక్ చిత్తడితో ప్రజలు, వాహన చోదకులు సతమతమౌతున్నారు. ఈ ప్రాంతాలు ఎప్పుడూ జనంతో రద్దీగా ఉండే ప్రాంతాలు. జయరామారావువీధి, సినిమావీధుల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అయితే నియంత్రించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. నాలుగుమాడావీధుల్లో వన్‌వే, వన్‌సైడ్ పార్కింగ్ పర్యవేక్షణ మినహా ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోవటం లేదు. జయరామారావువీధిలో పరిస్థితి పరిశీలిస్తే గతంలో ఒక్క ఎల్ఐసి కార్యాలయం వద్ద ఇరుకుతో ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం పార్కింగ్ సదుపాయం కల్పించకుండా స్టేట్‌బ్యాంక్ ఆఫ్‌ఇండియా, దాని పక్కనే ఆంధ్రాబ్యాంకు ఏర్పాటు చేసారు. దానికి ఎదురుగా ఓ ప్రైవేటు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్. వీటికి పార్కింగ్ సదుపాయం లేదు. దాంతో వచ్చిన ఖాతాదారులు రోడ్డు మీద తమ ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు ఇరుకు వీధుల్లో బేరివారి మండపం నుంచి తూర్పు వైపుకు అడ్డంగా ఆటోలు వస్తున్నాయి. దాంతో గంటల తరబడి ట్రాఫిక్ స్థంభించి పోతుంది. ఎదురుగా వచ్చే ఆటోలను పోలీసులు నియంత్రించ గల్గితే ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉండదు. కానీ ఎందుకో పోలీసులు ఆ దిశగా అడుగులేయటం లేదు.

సినిమావీధిలో...

శ్రీకాళహస్తికి గుండె వంటి సినిమావీధిలో పరిస్థితి పరిశీలిస్తే గతంలో ఎంత ట్రాఫిక్ ఉన్నా వాహనాలు వెళ్లెవి. కూడలి వద్ద గతంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసారు. ప్రస్తుత సిఐ దానిని తొలగించారు. దాంతో వాహనాలు సునాయాశంగా వెళుతున్నాయి. అయితే ఇక్కడ ఓ మాల్ ఏర్పడింది. దానికి పార్కింగ్ లేదు. ఆ షాపుకు వచ్చే ద్విచక్రవాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేస్తున్నారు. దాంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. మరో కీలకమైన స్థలం పెద్దమసీదువీధి. ఈ వీధిలో రెండు బిరియాని సెంటర్లు వెలిసినాయి. ఇక్కడ అసలే ఇరుకు ఓ వైపు బిరియాని పార్సిల్స్ కట్టుకోవటానికి వాహన దారులుమరో వైపు సైకిల్‌షాపు రోడ్డు మీద మరమ్మత్తులు తరచూ ఇక్కడ వాహనాలు నిలబడిపోతున్నాయి. మరో పాయింట్ కర్రిపాయింట్ షాపు రోడ్డు మీద వాహనాలను పార్కింగ్‌చేస్తున్నారు. దాంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టి అడ్డంగా వాహనాలు రాకుండా చర్యలు తీసుకుటే సరిపోతుంది. ఇక బజారువీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం పక్కనే ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ పాయింట్లలో నిత్యం పోలీసులు చూస్తూనే ఉంటారు. కానీ ఎందుకు స్పందించరో ఆ శివయ్యకే ఎరుక.

## శేషవాహనంపై దర్శనమిచ్చిన కోదండరాముడు



తవణంపల్లె, జూన్ 20 ప్రభాతవార్త: మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకోదండరాముడు సీతా లక్ష్మణ సమేతంగా శేష వాహనదారుడై గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమించారు. బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు స్వామివారికి శేషవాహనసేను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి చిత్తూరుకు చెందిన ఎన్.సాంబశివారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి అర్చకులు ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించగా సాయంత్రం ఊ ంజల్‌సేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## పక్కాగా శాంతిభద్రతలు

**- యాదమరి పోలీస్ స్టేషన్‌ను అకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ మణికంఠ చందోలు**



యాదమరి, జూన్ 20 ప్రభాతవార్త: శాంతిభద్రతలను పోలీసులు పక్కాగా సంరక్షించి ప్రజల అభిమానం పొందాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. యాదమరి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మణికంఠ చందోలు గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఎస్ఐ రామాంజనేయులు సెలవుపై వుండటంతో స్టేషన్ వివరాలను వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ పోలీస్ స్టేషన్‌లోని ప్రతి రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి పోలీసులతో సమీక్షించారు. ఈ సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసులను వినియోగించుకుని గ్రామాల్లోని ప్రతి ఇంటి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఫోక్సో, ఛీటింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల కట్టడికి బ్లాక్ పాయింట్స్‌ను సందర్శించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీసులు ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులేనని ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా న్యాయం చేయాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని, డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణకు వాహనాలు సకాలంలో వెళ్ళాలి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 20 ప్రభాతవార్త : నగరంలో ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, సకాలంలో వాహనాలు, చెత్త సేకరణకు వెళ్ళాలని నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం తెల్లవారు జామున నుండి నగరంలో ఎయిర్ బైపాస్ రోడ్డు, ఎస్‌జిఎస్ కాలేజీ రోడ్డు, ఆటో నగర్, చింత లచెను, ఉపాధ్యాయ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. మీ ఇంటికి ప్రతి రోజూ చెత్త సేకరణకు వాహనం వస్తోందా, దుకాణాల వద్ద ఇండ్ల వద్ద చెత్త కుండీలు ఉంచారని పరిశీలించి, స్థానికులతో మాట్లాడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే చెత్త సేకరణ వాహనాలను పరిశీలించి ఒక్కో వాహనం ఎంత చెత్త సేకరిస్తున్నారు. ఎన్ని సార్లు వెళ్తున్నారని డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంల ప్రతి రోజు ఒకే సమయంలో చెత్త సేకరణకు వాహనాలు వెళ్ళాలని, ప్రజల నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. వీధుల్లో ఎక్కడ చెత్త వేయకుండా తమ సిబ్బందికి ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. వర్షాలు పడుతున్నాయని నగరంలో ఎక్కడ వర్షపు నీరు, మురుగునీరు ఆగకుండా ఇంజినీరింగ్, పారిశుద్ధ్య సిబ్బంది ఒక అవగాహనతో పనిచేసి ఎక్కడా కాలువల్లో చెత్త నిలవకుండా శుభ్రం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి, మేస్త్రీలు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే పులివర్తి ఇంటికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

**-పులివర్తిని పరామర్శించిన మంత్రి కొల్లు**



తిరుపతిరూరల్, జూన్ 20 ప్రభాతవార్త: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. తిరుమల తిరుపతి పర్యటన నిమిత్తం తిరుపతికి విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్ర గురువారం తిరుపతిరూరల్ రఘనాథ్ రిసార్ట్స్ లో వున్న ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటికి వెళ్ళారు. మంత్రికి నాని పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలవతో ఘనంగా సన్మానించారు. చంద్రగిరి నియోజకవర్గంలో నెలకున్న పరిస్థితులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు మంత్రి హామీ ఇచ్చారు. చంద్రగిరిలో 30సంవత్సరాల చరిత్రను తిరగరాసిన ఘనత పులివర్తి నానికే దక్కుతుందన్నారు. చంద్రగిరిని మరింత అభివృద్ధి చేసి, ప్రజలలో మన్నలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీధర్‌నాయుడు, తిరుచానూరు కిశోర్‌రెడ్డి, భానుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై ప్రభుత్వ అధికారుల కొరడా!

**సీబీఐడీ కాలనీలో స్పృహ కోల్పోయిన మహిళ**



రేణిగుంట, జూన్ 20 ప్రభాతవార్త: ధనార్జన కోసం కొంత మంది రాజకీయ, మరికొంత మంది పార్టీల పేరు చెప్పుకుని పబ్బం గడుపుకునే దళారుల వల్ల నిరుపేదలైన నిర్భాగ్యులు గూడు కోల్పోయి అల్లో లక్ష్మణ అంటూ అల్లాడుతున్నారు. ఎవరో చేసిన పాపం పేదలకు శాపంలా చుట్టు కుంది. కొంత మంది దళారులు పేద ప్రజలను మభ్యపెట్టి ప్రభుత్వ భూముల్లో ఇంటిస్థలాలు ఇచ్చి మీకు మేమున్నామన్న భరోసా కల్పించి చిన్న చిన్న గూళ్ల నిర్మించుకునేలా చేశారన్నది అందరికి తెలిసిన సత్యం. అది కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా అమాయకులైన ప్రజలు ముఖ్యంగా దళితులు మాకు సొంత స్థలం ఇల్లు వచ్చేసిందని తమ కల సాకారం అయిందని భావిస్తున్న తరుణంలో ఆ సంతోషం కుప్ప కూలింది. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల కట్టుకున్నారంటూ అధికారులు పెద్ద సంఖ్యలోపోలీసు బలగాలను మోహరించేసి జేసీబీలతో సీబీఐడీ కాలనీ, వివేకానంద కాలనీలోని గూళ్ళను కూల్చేశారు. ఈ హఠాత్పరిణామానికి సీబీఐడీ కాలనీలో ఓ మహిళ స్పృహ కోల్పోయింది. గూడు కోల్పోయిన వారంతా ముక్తకంఠంతో గూడు కల్పించాలని వేడుకుంటున్నారు. సీబీఐడీ కాలనీకి చెందిన వారు తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని అభ్యర్థిస్తున్నారు. ఆక్రమణల తొలగింపు విషయమై రేణిగుంట తహసీల్దార్ నాగేశ్వరరావును వివరణ కోరగా ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల ఆక్రమణలపై దృష్టి సారించలేదన్నారు. ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం పదవీ బాధ్యతలు చేసుకున్నామన్నారు. వివేకానంద కాలనీ మీదుగా ప్రవహించే కాలువ ఆక్రమణలకు గురై వర్షాకాలం నీరు కాలనీలోకి వచ్చేస్తుందని, కాలువలో పేరుకుపోయిన చెత్తాచదారాన్ని వెంటనే తొలగించాల్సిందిగా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు లేఖ ద్వారా తెలియజేశామన్నారు.

## చంద్రబాబు, నల్లారి కిషోర్ విజయంతో మ్రొక్కులు

**మోకాళ్ళపై తిరుమలకు టిడిపి మహిళా కార్యకర్త గౌరీ**



చంద్రగిరి, జూన్ 20 ప్రభాతవార్త: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఎంఎల్‌ఏగా నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి విజయంతో టిడిపి మహిళా కార్యకర్త గౌరీ గురువారం మ్రొక్కులు తీర్చుకున్నారు. కలికిరి మండలం, గుట్టపాళెం, యల్లం పల్లెకు చెందిన టిడిపి మహిళా కార్యకర్త గౌరీ తన ఇష్టదైవమైన తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారికి మ్రొక్కుకున్నారు. తమ అధినాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలనీ, అదేవిధంగా తమ నాయకుడు నల్లారి కిషోర్ ఎంఎల్‌ఏగా విజయం సాధించాలని ప్రార్థించారు. ఆ మేరకు భగవంతుడి ఆశీస్సులు లభించడంతో శ్రీవారిమెట్టు మార్గంలో మోకాళ్ళపై కొండకు నడిచి మ్రొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం పూర్వ వైభవం సంతరించుకునేందుకు చంద్రబాబు నాయకత్వం, తమ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధించేందుకు నల్లారి విజయం దోహదపడగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జనార్ధన్ గౌడ్, మల్లికార్జున గౌడ్, నిజాముద్దీన్ కె.వి.రెడ్డి, మధు రెడ్డి, జ్ఞానమూర్తి, చిట్టి, విజయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల జెఈఓగా వెంకయ్యచౌదరి



తిరుమల, జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి తిరుమల జెఈఓగా వెంకయ్యచౌదరి నియమితుల య్యారు. ఆయన ప్రస్తుతం విజయవాడ కస్టమ్స్ కమిషనర్‌గా విధులునిర్వహిస్తున్నారు. 2019 తరువాత తిరుమలకు జెఈఓ పోస్టింగ్ ఇవ్వలేదు. గత వైసిపి ప్రభుత్వం సర్వస్వం అదనపు ఈఓ, ఈఓగా ధర్మారెడ్డికి బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇటీవలే నూతన ఈఓ శ్యామలరావును నియమించగా తిరుమల జెఈఓగా వెంకయ్యచౌదరిని నియమించినట్లు తెలుస్తోంది. ఆయన త్వరలోనే ఇక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. తిరుమలలో భక్తులకు దర్శనాలతోబాటు ఆలయ పరిపాలన, భక్తులకు దర్శనాలు కల్పించడం, సేవలు తదితరు వాటిపై జెఈఓ పట్టుఉంటుంది.

## చినరాజుకుప్పం అభివృద్ధికి పాటుపడతా : విజయ్‌బాబు



పుత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త : తన తల్లి దివంగత పోతుగుంట సరస్వతమ్మ జ్ఞాపకార్థం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు గురువారం తన సొంత గ్రామం చిన్నరాజుకుప్పం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పెన్నులు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. పాఠశాలకు ఉచితంగా ఒక బీరువా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రకటించి నట్టుగా తన సొంత గ్రామాభివృద్ధికి కట్టుబడి వున్నానని అందులో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సహాయం చేయడం సంతోషంగా వుందన్నారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇ.రవినాయుడు, పరమేశ్వరమంగళం ఎంపిటిసి సభ్యులు శ్రీజ బాలాజీనాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ధనపాల్, నాయకులు దాసరి విజయ్‌చౌదరి, పోతుగుంట రమేష్ నాయుడు, అజయ్‌చౌదరి, చంద్రయాదవ్, మేఘనాథ్, మణికంఠ, చినరాజుకుప్పం గ్రామ టిడిపి నాయకులు ఎన్.ఆదికేశవనాయుడు, గోవర్ధన్ నాయుడు, రూపేష్, నరేష్, చిన్నపాప, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పాలసముద్రంలో శాంతించిన అతిసారా

**- డిపిఓ లక్ష్మీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు**



పాలసముద్రం, జూన్ 20 ప్రభాతవార్త: పాలసముద్రం గంగజాతర పురస్కరించుకొని సేవించిన అంబలి ప్రభావంతో అతిసారకు గురైన ప్రజల ఆరోగ్యం గురువారం నిలకడ అయ్యింది. గంగజాతర సందర్భంగా ప్రజలు సేవించిన అంబలి ప్రభావంతో గ్రామంలో 140 మంది వరకు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలిసిన జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ హుటాహుటిన పాలసముద్రం చేరుకుని పరిస్థితిని సమీక్షించి గురువారం పాలసముద్రంలో రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. పాలసముద్రం గ్రామంలో ఒక మెడికల్ క్యాంపు, పాలసముద్రం బీసీ కాలనీల్లో మరొక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలందరికీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ మెడికల్ క్యాంపుల ద్వారా గ్రామం పరిధిలోని 70 మంది చికిత్స పొంది కోలుకున్నారు. గురువారం సాయంత్రం నాటికి పాలసముద్రం గ్రామంలో పరిస్థితి ఒక కొలిక్కి వచ్చినప్పటికీ గ్రామానికి చెందిన మరో 16 మంది కోలుకోవాల్సి వుంది. వీరు గురువారం రాత్రికి పూర్తి స్థాయిలో రికవరి కావచ్చునని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం విస్తృతంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీతో పాటు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, డిఇ విద్యాసాగర్, ఎఇ హిమత్‌కుమార్, డిఎంహెచ్ఓ కార్యాలయ ఎపిడలాజిస్ట్ శ్రీవాణి, ఎంపిడిఓ రామనాథరెడ్డి, తహసిల్దారు సుబ్బలక్ష్మీ, ఇఓఆర్డీ రమేష్, ఎస్ఐ భారతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్‌కృష్ణ, మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.